నవతెలంగాణ
ఆదిలాబాద్
గురువారం | సెప్టెంబర్ 26, 2024 | www.navatelangana.com
1

28న లోక్ అదాలత్ : సీపీ శ్రీనివాస్

నవతెలంగాణ-నస్పూర్

లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 28న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రాజీమార్గం రాజమార్గమని, కక్షకారుణ్యాలతో ఏమీ సాధించలేమని, రాజీపడితే ఇద్దరూ గెలిచినట్లేనని తెలిపారు. రాజీపడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్, సివిల్ తగాదా, ఆస్తి విభజన, కుటుంబపరమైన నిర్వహణ, వైవాహిక జీవితానికి సంబంధించినవి, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు, ఇతర రాజీ పడదగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని సూచించారు. పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వర్తించే కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది రాజీపడ దగిన కేసులను గుర్తించి ఇరు గ్రూపుల వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు.

అక్టోబర్ 1 వరకు వయోవృద్ధుల వారోత్సవాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల నుంచి అక్టోబర్ 1 వరకు వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖాధికారి సబిత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ అధ్యక్షతన వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాల పోస్టర్ విడుదలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ నెల 26న వృద్ధాశ్రమాలలో వయోవృద్ధుల క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 27న వాకతాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం- 2007, ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు, 29న సర్పంచ్, పంచాయతీ సెక్రటరీలకు తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టం 2007పై అవగాహన, ఎల్డర్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 14567పై అవగాహన సదస్సు, 30న అంగన్వాడి కేంద్రాలలో, పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహణ ఉంటుందని పేర్కొన్నారు. అక్టోబర్ 1న జిల్లా స్థాయి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంతో ముగుస్తుందని పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌లోనూ హైడ్రా..!

- అతి త్వరలోనే కార్యరూపానికి అధికారుల సన్నాహాలు
- చెరువులు, ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై దృష్టి
- వివిధ శాఖలతో నాలుగు బృందాలు ఏర్పాటు
- ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 392 తటాకాలు

ఆదిలాబాద్ జిల్లాలోనూ 'హైడ్రా' తరహా వ్యవస్థను తీసుకురానున్నారు. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. చెరువులు, కుంటలు, భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమవుతోంది. హైదరాబాద్‌లో ఈ సంస్థ చేపడుతున్న చర్యలను జిల్లా స్థాయిలోనూ అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీంతో ప్రభుత్వం ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయగా.. జిల్లా ఉన్నతాధికారులు సైతం హైడ్రా లాంటి వ్యవస్థను జిల్లాలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో అధికార ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో అనేక ఏండ్లుగా అన్యాక్రాంతానికి గురైన చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఈ సంస్థ ఉక్కుపాదం మోపనుందని తెలుస్తోంది. జిల్లాలో 392 చెరువులు ఉండగా.. ఇందులో ఎన్ని కబ్జాలకు గురయ్యాయో అధికారులు లెక్కలు తీయనున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

హైదరాబాద్‌లో చెరువుల సంరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. చెరువులను ఆక్రమించి నిర్మించిన భవనాలు, కార్యాలయాలను హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) నేలమట్టం చేయడాన్ని హర్షిస్తుండగా.. నివాస గృహాలను కూల్చివేయడంతో నిరసనలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. కాగా అన్ని జిల్లాలో హైడ్రా తరహా వ్యవస్థ తీసుకురావాలని వివిధ పార్టీలు, ప్రజల నుంచి డిమాండ్లు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఆ దిశగా దృష్టి సారించింది. జిల్లా స్థాయిలోనూ ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ఇది వరకే జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉన్నతాధికారులు ఈ తరహా వ్యవస్థను ఏర్పాటుచేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. మంచిర్యాలలోని నస్పూర్‌లో ఇప్పటికే ఓ భవనాన్ని అధికారులు నేలమట్టం చేయగా.. రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపైనా అక్కడి అధికారులు దృష్టిసారించినట్లు తెలుస్తోంది.

నాలుగు బృందాలు ఏర్పాటు..!

జిల్లాలో చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను సంరక్షించేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనుంది. ఇందులో రెవెన్యూ, నీటిపారుదల, మున్సిపల్, పంచాయతీరాజ్‌శాఖలతో సంయుక్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో శాఖ నుంచి నలుగురు అధికారుల చొప్పున ఈ సంస్థల్లో నియమించి నాలుగు బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ బృందాలు 1950 నుంచి రికార్డులను పరిశీలన చేసి ఎక్కడెక్కడ చెరువులు ఉన్నాయి. వాటి విస్తీర్ణం ఎంత..? ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయి..ఎన్ని కబ్జాలకు గురయ్యాయో పూర్తి వివరాలను తెలుసుకొని తొలుత నివేదిక సిద్ధం చేయనున్నట్లు తెలిసింది.

జిల్లాలో 392 చెరువులు..!

ఆదిలాబాద్ జిల్లాలో 392 చెరువులు, కుంటలు ఉన్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు లెక్కలు తేల్చారు. వీటిలో ఆదిలాబాద్ పట్టణంతో పాటు మావల సమీపంలో 42 చెరువులు ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా ఆదిలాబాద్ పట్టణంలో ఉన్న ఖానాపూర్ చెరువులు విస్తీర్ణం 120 ఎకరాల్లో విస్తరించి ఉండగా..ఇందులో సుమారు 20 ఎకరాల వరకు అన్యాక్రాంతమైనట్లు అధికారులు గుర్తించారు. ఈ చెరువులో 240 వరకు నివాస గృహాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇక పల్లె ప్రాంతాల్లో ఉన్న చెరువులపైనా దృష్టి సారించనున్నారు. అనేక చోట్ల చెరువులను ఆక్రమించి పంటలు సాగు చేయడం.. ఇతరాత్ర నిర్మాణాలు చేపట్టడం వంటివి చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో ఉన్న ఆక్రమణలన్నింటిపైనా ఈ ప్రత్యేక వ్యవస్థ దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ భూములపైనా నజర్..!

చెరువులు, కుంటలే కాకుండా అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపైనా దృష్టి సారించనుందని తెలుస్తోంది. ఇప్పటికే ఆదిలాబాద్ పట్టణం చుట్టుపక్కల వందల ఎకరాల సర్కారు భూములు ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. అనేక అసైన్డ్ భూములకు ఎన్‌ఓసీ(నిరభ్యంతర పత్రం) తీసుకొని క్రయవిక్రయాలు జరుపుతున్నట్లు ఆరోపణలున్నాయి. కొందరు అక్రమార్కులు అధికారులను మచ్చిక చేసుకొని రికార్డులు మార్పు చేసి సర్కారు భూములను సొంతం చేసుకుంటూ ప్లాట్లు చేసి విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఆదిలాబాద్ చుట్టుపక్కల ప్రభుత్వ భూమి దొరకని పరిస్థితి తలెత్తింది. వందల ఎకరాలు అన్యాక్రాంతం కావడంతో భవిష్యత్తు అవసరాలకు సైతం లభించని పరిస్థితి కనిపిస్తోంది. ఆదిలాబాద్‌లో భూముల అన్యాక్రాంతంపై అనేక ఏండ్లుగా ఆరోపణలునప్పటికీ..అధికారులెవరూ అటు వైపు దృష్టిసారించిన సందర్భాలు లేవు. తాజాగా ప్రత్యేక అధికారుల వ్యవస్థ ఏర్పాటుకానుండటంతో ఇప్పటికైనా కబ్జాలకు గురైన సర్కారు భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరికొందరు నాళాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వర్షాకాలంలో వరద నీరు బయటకు వెళ్లలేని పరిస్థితి తలెత్తుతోంది.

ఆదేశాలు రాగానే ఏర్పాటు చేస్తాం : రాథోడ్ విఠల్, నీటిపారుదల శాఖ ఈఈ



జిల్లాలోనూ హైడ్రా తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. కానీ జిల్లా ఉన్నతాధికారుల నుంచి తమకు ఇంకా ఆదేశాలు రాలేదు. ఒకటి, రెండు రోజుల్లో ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఒకటి, రెండు చోట్ల చెరువుల ఆక్రమణలను గుర్తించాం. బృందం ఏర్పాటు కాగానే ఉన్నతాధికారుల ఆదేశాలతో పూర్తిస్థాయిలో విచారించి అవసరమైన చర్యలు చేపడతాం.

వడ్ల లారీ పట్టివేత



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కౌటాల మండలం నుండి మిర్యాలగూడకు వెళుతున్న వడ్ల లారీని బుధవారం ఉదయం పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టుకున్నారు. స్థానిక లారీ అసోషియేషన్ కార్యాలయం సమీపంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వినోద్‌కుమార్ ఈ లారీని పట్టుకొని కాగజ్‌నగర్‌లోని సివిల్ సప్లయి గోదాంకు తరలించారు. ఆ లారీలో వడ్లు ఉండడం, ప్రభుత్వ గోనె సంచులలోనే ఈ వడ్లను తరలిస్తుండడంతో అనుమానంతో లారీని గోదాంకు తరలించినట్లు తెలిసింది. లారీలోని వడ్ల శాంపిళ్లను సేకరించిన అనంతరం పౌరసరఫరాల అధికారులు కౌటాల మండలకేంద్రంలోని ఒక రైస్ మిల్లుకు వెళ్లి అక్కడ విచారణ జరిపినట్లు తెలిసింది. మంగళవారం రాత్రి పట్టుబడ్డ లారీతో పాటు మరో లారీని లారీ అసోషియేషన్ కార్యాలయం వద్ద ఆపగా, ఒక లారీ వెళ్లిపోయిందని, మరో లారీ డీఎస్‌ఓకు పట్టుబడ్డట్లు సమాచారం. వాస్తవానికి ఈ వడ్లు సన్న వడ్లా లేక దొడ్డు వడ్లా అనేది తెలియాల్సి ఉంది. ఏ వడ్లు అయినా ప్రభుత్వ గోనె సంచులలో తరలించడం పట్ల సందేహాలు తలెత్తుతున్నాయి. దీని గురించి తెలుసుకునేందుకు జిల్లా పౌరసరఫరాల అధికారి వినోద్‌కుమార్‌కు పలు మార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడం అనుమానాన్ని రేకెత్తిస్తోంది.

రిమ్స్ ఎదుట ఆక్రమణల తొలగింపు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కోల్‌కత్తా ఘటన నేపథ్యంలో కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు రిమ్స్ ఎదుట ఆక్రమణలను తొలగిస్తున్నామని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. బుధవారం రిమ్స్ పరిసరాల్లో ఉన్న దుకాణాలను మున్సిపల్, పోలీసు శాఖ అధికారులతో కలిసి తొలగించారు. దుకాణదారులకు ముందస్తుగా సమాచారం ఇవ్వడంతో వారు స్వచ్ఛందంగా తీసేశారు. ఎలాంటి ఇబ్బందులు కాకుండా టూటౌన్ సీఐ కరుణాకర్‌రావ్ పోలీసులను మోహరించారు. మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ మున్సిపల్ అధికారులతో పాటు దుకాణాల యాజమనులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ మాట్లాడుతూ కోల్‌కత్తా ఘటన నేపథ్యంలో పరిసరాల్లో దుకాణాలు రోడ్డుపైకి రావడంతో తొలగించామన్నారు. రాత్రి విధులు నిర్వర్తించే పీజీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు రాతపూర్వకంగా ఇచ్చారన్నారు. కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ఇక్కడ నుంచి దుకాణాలను తొలగించి వేరే చోటకు మారుస్తున్నట్లు తెలిపారు. అంబులెన్స్‌లు కూడా రావడానికి కష్టంగా మారిందని, భద్రత విషయం కూడా చూసి వాటిని తొలగించామని పేర్కొన్నారు.

పత్తి, వరి పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

నవతెలంగాణ-హాజీపూర్

పత్తి, వరి పంటల్లో సమయానుసారంగా సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ కోట శివరామకృష్ణ అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని రాపల్లి, టీకనపల్లి గ్రామాలలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పనతో కలిసి పత్తి, వరి పంటలలో బుధవారం క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా కోట శివకృష్ణ మాట్లాడుతూ పిండె రాలటం, రసం పీల్చే పురుగులను గుర్తించడం జరిగిందన్నారు. అంతేగాక గులాబీ రంగు పురుగు, కాయకుళ్లు తెగులు ప్రబలే అవకాశముందని తెలిపారు. వాటి నివారణకు పిచికారి చేయాల్సిన మందులు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, మండల వ్యవసాయ అధికారి కృష్ణ, ఏఈవో ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

చెత్తను మున్సిపల్ ఆటోల్లోనే వేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చెత్తను రోడ్లు, మురుగు కాలువల్లో వేయకుండా మున్సిపల్ ఆటోల్లో వేయాలని సానిటరి ఇన్‌స్పెక్టర్ నరేందర్ అన్నారు. స్వచ్ఛత హి సేవలో భాగంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్‌లో స్వచ్ఛదన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ప్రహరీ వెంట కాలనీవాసులు పారవేసిన చెత్తను తొలగించారు. గడ్డి మొక్కలను పీకి వేశారు. చెత్తను పారేసి అనారోగ్య పరిస్థితులను కల్పించవద్దని కళాశాలను ఆనుకొని ఉన్న కాలనీవాసులకు సూచించారు. స్వచ్ఛతా హి సేవలో వారం రోజుల పాటు మున్సిపల్ తరపున వివిధ కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు కూడా పట్టణాన్ని స్వచ్ఛతగా ఉంచేలా సహకారం అందించాలన్నారు. తడిపొడి చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మున్సిపల్ వాహనాల్లో వేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంగీత, వైస్ ప్రిన్సిపాల్ జగ్రామ్, అధ్యాపకులు శ్రవాణి, సంతోష్‌కుమార్, రవి కిరణ్, ఎన్విర్మామెంట్ ఇంజనీర్ రవికిరణ్, కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్ సైకిల్‌తో ఎడ్లబండిని ఢీకొట్టి వ్యక్తి మృతి

నవతెలంగాణ-బోథ్

మండలంలోని నాగపూర్ గ్రామానికి చెందిన కోట్నక్ కైలాష్(35) మోటార్ సైకిల్‌తో ఎడ్లబండిని ఢీకొట్టి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 24న గ్రామం నుంచి ధన్నూరు వెళుతుండగా మార్గం మధ్యలో మోటార్ సైకిల్‌పై అతి వేగంగా వెళుతూ ఎడ్లబండిని ఢీకొట్టాడు. దీంతో కుటుంబీకులు ఆయనను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

సొసైటీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్ : శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో ప్రతీ మంగళవారం నిర్వహించే ఉచిత కంటి పరీక్షా శిబిరంలో ఆపరేషన్లకు ఎంపికైన వారిని బుధవారం తన స్వంత ఖర్చులతో బెల్లంపల్లి లయన్స్ కంటి ఆసుపత్రికి పంపించారు. వారికి రవాణా, భోజన ఖర్చులను డాక్టర్ శ్రీనివాస్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా సేవలందిస్తున్నామని, వేల మందికి కంటి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉచిత వైద్య శిబిరం ఇన్‌ఛార్జి గోపితో పాటు కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా రక్షణ చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

- ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత
- ఆదిలాబాద్ జిల్లా 4వ మహాసభలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళ రక్షణ కోసం అనేక చట్టాలు వచ్చిన అవి సక్రమంగా అమలు చేయని కారణంగా రోజురోజుకు మహిళలపై లైంగికదాడులు, హత్యలు పెరుగుతున్నాయని ఐద్వా(అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆశాలత అన్నారు. బుధవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఐద్వా జిల్లా 4వ మహాసభలను నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మూడేండ్ల కాలంలో సంఘం తరపున చేసిన పోరాటలు, వచ్చే మూడేండ్ల కాలంలో చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు. ముందుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు శకుంతల జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆశాలత మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం అనేక చట్టాలను ప్రభుత్వాలు తీసుకొస్తున్నా వాటిని కఠినంగా అమలు చేయడం లేదని అన్నారు. దాని కారణంగా భయం లేకుండా పోతోందన్నారు. దేశ వ్యాప్తంగా అందుకే 9 నెలల పాప నుంచి పండుముసలి వరకు లైంగికదాడులకు గురవుతున్నారని తెలిపారు. ఆడ పిల్లను బయటకు పంపాలంటేనే భయంగా ఉందన్నారు. సురక్షితంగా ఇంటికి వస్తుందో లేదో తెలియని ఆందోళనలో ఉన్నామని పేర్కొన్నారు. మహిళ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మహిళ రక్షణ, ఇతర సమస్యలపై వచ్చే మూడేళ్ల కాలంలో చేపట్టే కార్యక్రమాలను రూపొందించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 21 నుంచి 23 వరకు కొత్తగూడెంలో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలకు జిల్లా నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రి, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లంక జమున, శకుంతల, కోశాధికారి ఆర్.మంజుల, కో-కన్వీనర్ లలిత, జిల్లా కమిటీ సభ్యురాలు పంచపూల, ప్రభావతి, విజయ, ఆరిఫా, సాహిర పాల్గొన్నారు.



బెల్లంపల్లి అభివృద్ధికి కృషి : గడ్డం వంశీ



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. బుధవారం బెల్లంపల్లిలో రూ.7.58 కోట్ల నిధులతో నిర్మించిన కూరగాయల మార్కెట్ భవనాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బెల్లంపల్లి అభివృద్ధి కోసం ఎంపీ నిధుల కేటాయిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ చేపడుతున్న అభివృద్ధిలో భాగస్వామి నవుతానని తెలిపారు. ప్రజలకు స్థిర కాలంగా నిలిచే పథకాలకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ఎన్నికల ముందు వ్యాపారులు మార్కెట్ సముదాయం కావాలని అడిగిన దాని ప్రకారం కూరగాయల మార్కెట్ నిర్మించామన్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం బెల్లంపల్లిలో ఎలాంటి అభివృద్ధిని చేపట్టలేదని తెలిపారు. మార్కెట్ సముదాయాన్ని వ్యాపారులు సక్రమంగా వినియోగించుకొని వృద్ధిలోకి రావాలన్నారు. బెల్లంపల్లిలో రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించేందుకు అమృత 2.0 కింద రూ.61.5కోట్ల నిధులతో ఎల్లంపల్లి తాగునీటి పథకాన్ని చేపట్టామన్నారు. త్వరలో బెల్లంపల్లి ప్రజలకు ఎల్లంపల్లి తాగునీటిని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సూరిబాబు, చిలుముల శంకర్, మల్లయ్య, ఎస్ఈ శ్రవణ్‌కుమార్, బెల్లంపల్లి డిఈ రాజన్న, ఏడిఈ శ్రీనివాస్, రాంచందర్, పెద్దిరాజం, బెల్లంపల్లి ఏఈ బి.శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రూ.2.25కోట్ల విలువ గల గంజాయి పట్టివేత

- అంతర్రాష్ట్ర గంజాయి ముఠా సభ్యుల అరెస్ట్



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని మహారాష్ట్ర సరిహద్దున గల లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్ వద్ద రూ.2.25కోట్ల విలువ గల గంజాయి తరలిస్తున్న కంటైనర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ గౌస్ ఆలం వివరాలు వెల్లడించారు. ఆంధ్ర, ఒరిస్సా ప్రాంతాల నుండి మహారాష్ట్రలోని బుల్డానధూలే జిల్లాకు కంటైనర్‌లో గంజాయి తరలిస్తున్నారు. 292 ప్యాకెట్లలోని దాదాపు 900కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి 8మందిపై కేసు నమోదు చేశారు. నిందితుల నుండి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కంటైనర్‌ను సీజ్ చేశారు. నిందితుల్లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ వసీం అన్సారి, క్లీనర్ అర్మాన్‌ను అరెస్ట్ చేశారు. ఒడిస్సాకు చెందిన ఆశిష్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన పండిత్‌జీ పరారీలో ఉన్నారు. వీరితో పాటు గుర్తుతెలియని మహారాష్ట్రకు చెందిన వ్యక్తులు పరారీలో ఉన్నారు. పెద్ద ఎత్తున గంజాయి తరలుతోందని పక్కా సమాచారంతో కంటైనర్‌ను తనిఖీ చేయగా భారీ ఎత్తున గంజాయి పట్టుబడింది. డ్రైవర్, క్లీనర్‌ను ప్రశ్నించగా ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌కు చెందిన అన్ను జైన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన పండిత్‌జీ, సోను అన్సారి మిత్రులందరికీ మూడు సంవత్సరాలుగా గంజాయి వ్యాపారం చేస్తున్నామని తెలిపారు. అతను గత సంవత్సరం చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్, సుక్మా, జగదల్‌పూర్ జిల్లాల అటవీ ప్రాంతం నుండి చాలాసార్లు తన వాహనంలో గంజాయిని తీసుకొచ్చి ఈ ముగ్గురికి ఇచ్చారని తెలిపారు. ఇలా గంజాయి తెచ్చి వారికి ఇస్తే పెద్ద మొత్తంలో డబ్బులు ఇస్తున్నారని తెలిపారు. ఆంధ్ర ఒడిస్సా బార్డర్ అటవీ ప్రాంతంలో ఉన్న 900కిలోల గంజాయిని మహారాష్ట్రకు తరలిస్తే రూ.1.50లక్షలు ఇస్తామని చెప్పడంతో వసీం ఒప్పుకున్నాడు. ప్లాన్ ప్రకారం గంజాయి ఇవ్వాల్సిన పార్టీకి చెందిన ఓ వ్యక్తి కారులో పైలెట్ వాహనంగా ఉంటాడని వెనుక వెళ్లాలని వసీంకు చెప్పారు. దాని ప్రకారం గంజాయి నింపుకుని వరంగల్, కరీంనగర్ మీదుగా పైలెట్ వాహనం వచ్చిన రూట్లో వస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకోవడం జిల్లాలో ఇదే మొదటిసారని ఎస్పీ పేర్కొన్నారు. ముఠా సభ్యులను అరెస్టు చేయడం, కేసు నమోదులో కీలకపాత్ర పోషించిన డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, డిసిఆర్బి డిఎస్పి బి. సురేందర్‌రెడ్డి, అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల ముఠాను చాకచక్యంగా పట్టుకున్న ఆదిలాబాద్ రూరల్ సీఐ కె.ఫణిధర్, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, జైనథ్ సీఐ డి.సాయినాథ్, ఆదిలాబాద్ రూరల్ సర్కిల్ ఎస్సైలు అంజమ్మ, ముజాహిద్, విష్ణువర్ధన్, సిసిఎస్ రూరల్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. నగదు బహుమతి అందించి ప్రోత్సహించారు.



వయోవృద్ధుల సంక్షేమానికి పోషణ నియమావళి



నస్పూర్ : వయోవృద్ధుల పోషణ, సంక్షేమం కోసం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పోషణ సంక్షేమ నియామవళి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఇన్చార్జి జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వరూపారాణి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు మహేందర్‌తో కలిసి సంక్షేమ నియమావళి-2011 కార్యక్రమ సంబంధిత వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 25 నుండి 30 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 26న వృద్ధాశ్రమాలు, డే కేర్ సెంటర్లలో వయోవృద్ధుల క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న ఓవర్ బ్రిడ్జి నుండి ముఖరాం చౌరస్తా వరకు వాకతాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ చట్టం-2007, ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు, 29న అంగన్వాడీ కేంద్రాలలో, పాఠశాలల్లో గ్రేండ్ పేరెంట్స్ డే, 30న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టం-2007, వయోవృద్ధుల లైన్‌టోల్ ఫ్రీ నం.14567పై అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, పోషణ - సంరక్షణ చట్టంపై వృద్ధులు అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హబ్ సమన్వయకర్త సౌజన్య, డిసిపియు ఆనంద్, సీనియర్ అసిస్టెంట్ స్వరూపారాణి, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి ఎండి. ఫర్జానా బేగం, రాజ్యలక్ష్మి, వసంత, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు హనుమంతు, సత్యనారాయణ పాల్గొన్నారు.

గమ్యం యాప్‌తో మరిన్ని సేవలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



ఆర్టీసీలో ప్రవేశపెట్టిన గమ్యం యాప్‌తో ప్రయాణికులు మరింత సేవలు అందిస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన అన్నారు. బుధవారం అంబేద్కర్ చౌక్‌లోని బస్ స్టాండ్ వద్ద ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీలో క్యూఆర్ కోడ్ స్కాన్‌ను ప్రవేశ పెట్టిందన్నారు. దీని ద్వారా ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్ ద్వారా ఆర్టీసీలో రిజర్వేషన్‌తో పాటు గమ్యం యాప్ ద్వారా బస్సుల లోకేషన్‌ను గుర్తించవచ్చని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

నవతెలంగాణ-ఉట్నూర్



పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ క్రీడలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్ బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో కష్టపడి చదివి జీవితంలో ఉన్నతంగా ఎదగలన్నారు. వేడుకల్లో భాగంగా జూనియర్లను స్వాగతం పలికేల విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాలా ఆక్రమదారులపై విచారణ చేపట్టాలి

- ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు పక్కన ఉన్న నాలా అక్రమదారుల పై పూర్తి విచారణ చేపట్టాలని ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ తహసీల్దార్ ప్రవీణ్‌ను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆక్రమిత నాలా చుట్టూ నిర్మించిన వివిధ నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి నాలాను కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. తహసీల్దార్ నాలా మ్యాపు, వివిధ సర్వే నెంబర్లలో ఉన్న రికార్డులను సబ్ కలెక్టర్‌కు వివరించారు. పూర్తి విచారణ చేపట్టి తనకు నివేదిక అందించాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ ఈఓ సంజీవ్ రావ్ ఉన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి : మండల ప్రత్యేకాధికారి సాయన్న

ఏజన్సీలో 1/70 చట్టానికి విరుద్దగా అక్రమంగా భవనాలు నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి సాయన్న ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్, ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు 1969 తరువాత వచ్చిన గిరిజనేతతులు మండల కేంద్రంలో అక్రమ భవనాలను నిర్మిస్తున్నారన్నారు. ప్రస్తుతం మండల కేంద్రంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై నోటీసులు జారీచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బినామీ నిర్మాణాల భవనాలకు పంచాయతీ కార్యదర్శులు ఇంటి నెంబర్ కేటాయించకుడదని, ఇంటి పన్నులు సైతం వసూలు చేయొద్దన్నారు. ఇండ్ల నిర్మాణం చేస్తున్న వారికి నోటీసులు అందచేసి నిర్మాణాలను ఆపాలని సూచించారు. ఆదివాసీ చట్టాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీఓ సమీర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన అనిత



నవతెలంగాణ-నార్నూర్

మండలానికి నూతన ఎంఈఓగా నియమితులైన పవార్ అనిత బుధవారం ఎమ్మార్సీలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఆమెకు ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. విద్యాభివృద్ధికి మరింత కృషి చేస్తానని పేర్కొన్నారు. సన్మాన కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులున్నారు.

ఫార్మాసిస్ట్‌ల సమస్యలు పరిష్కరించాలని



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఫార్మాసిస్టుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఫార్మాసిస్టుల సంఘం అధ్యక్షుడు అశోక్ అన్నారు. బుధవారం ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డ్రగ్ ఇన్స్‌పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఉన్న అన్ని మెడికల్ షాప్స్‌లో ఫార్మాసి యాక్ట్ 1948 ప్రకారం ఫార్మాసి చేసిన వాళ్లు మాత్రమే మెడికల్ షాప్స్ నడపాలన్నారు. కానీ మెడికల్ స్టోర్‌లో కూడా ఫార్మాసి చేసిన ఫార్మాసిస్టులు లేరన్నారు. షాప్స్‌లను తనిఖీ చేసి ఫార్మసిస్ట్ లేని షాప్స్ లైసెన్సస్‌ని రద్దు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం వైస్ ప్రెసిడెంట్ కపిల్ కుమార్, బోథ్ మండల ప్రెసిడెంట్ వీరయ్య, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ఫైనాన్స్ సెక్రెటరీ రాజేష్, ఇచ్చోడ మండల ప్రెసిడెంట్ అరుణ్ కుమార్, నాయకులున్నారు.

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో వేగం పెంచాలి

నవతెలంగాణ-నార్నూర్

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో వేగం పెంచాలని ఎంపీడీఓ జవహర్ లాల్ సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండ ప్రణాళిక ప్రకారం సానిటేషన్ చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల సహకారంతో పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలు సిద్ధం చేయాలన్నారు. గ్రామంలో పేసా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. విశ్వకర్మ పథకానికి దరఖాస్తులు చేసుకున్న లబ్దిదారులకు అర్హులుగా గుర్తించాలన్నారు. సమావేశంలో ఏపీఓ జాదవ్ సురేష్, ఎంపీఓ స్వప్న షీలా, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలున్నారు.



వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

- కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగ, వయవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 1వ తేది వరకు వారం రోజులు వయోవృద్ధుల అవగాహన, వినోదాల వారంగా నిర్వహించాలని సూచించారు. వృద్ధాశ్రమాలలో క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తల్లిదండ్రుల పోషణ, ఆరోగ్య సంరక్షణపై అవగాహన ర్యాలీ, సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టం 2007పై అవగాహన కల్పించాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డేను నిర్వహించాలని, అక్టోబర్ 1న జిల్లా స్థాయి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. వయోవృద్ధులకు ఆరోగ్య సంరక్షణ, సామాజిక భద్రత, చట్టపరమైన రక్షణ, న్యాయ సలహాలను అందించాలని సూచించారు. జిల్లాలోని వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమానికి, శ్రేయస్సుకు కట్టుబడి ఉంటామని అధికారులు, వయోవృద్ధుల చేత ప్రతిజ్ఞ చేయించారు. పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించి వయోవృద్ధులను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రత్న కళ్యాణి, డీఈఓ రవీందర్ రెడ్డి, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, వయోవృద్ధుల కమిటీ మెంబెర్స్ ఎంసీ లింగాన్న, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్య అభివృద్ధికి డ్యూటీ మీట్‌ల నిర్వహణ

- ఎస్పీ గౌస్ ఆలం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీసు అధికారులు సిబ్బంది పనితనాన్ని మెరుగుపరిచేందుకు, పెంపొందించేందుకు జిల్లా స్థాయి జోనల్ స్థాయి రాష్ట్రస్థాయి జాతీయస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లను నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. బుధవారం పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌ను ఎస్పీ ప్రారంభించారు. ఈ డ్యూటీ మీట్‌లో నేర పరిశోధన, నేర స్థల పరిశోధన, వీఐపీ మూమెంట్, యాంటీ సబటేజ్ చెక్, డాగ్ స్క్వాడ్ పనితనం, ఫింగర్ ప్రింట్‌పై పరిశోధన, బాంబు డిస్పోజల్ టీం విధులు, కంప్యూటర్‌పై నైపుణ్యం, నేర స్థలంలో ఫొటోగ్రఫీ, అవాంఛనీయ సంఘటనలో సంభవించినప్పుడు వీడియోగ్రఫీ చేయు విధానం లాంటి అంశాలలో రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి జిల్లా స్థాయిలో నగదు రివార్డులను అందజేస్తామన్నారు. ఈ పరీక్షలు కొన్ని అంశాలు ఇన్స్‌పెక్టర్, ఎస్సై స్థాయి వారికి, మరికొన్ని అంశాలు ఏఎస్ఐ నుండి కానిస్టేబుల్ వరకు జరుగుతాయని తెలిపారు. జాతీయస్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతి పొందిన వారికి జాతీయ స్థాయి నుండి అత్యధిక నగదు బహుమతి లభిస్తుందన్నారు. ఇలాంటి డ్యూటీ మీట్‌లలో పాల్గొన్నప్పుడు తమకు ఉన్న నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చని, ప్రస్తుత సమాజంలో నేరగాళ్లు ఉపయోగిస్తున్న నూతన పద్ధతులను తెలుసుకోవచ్చని, నూతన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవచ్చని, ట్రైనింగ్‌లో వాస్తవానికి ఉన్న భేదాలను గమనించవచ్చని, నేరం జరిగే పద్ధతులను పరిశోధించే పద్ధతులను వివరంగా అర్థం చేసుకొని తమ విధులను ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎలాంటి సందేహాలున్న నివృత్తి అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, హసీబుల్లా, బి సురేందర్ రెడ్డి, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికుల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ కార్మికులకు మూడు నెలల నుంచి జీతాలు రావడం లేదని వెంటనే చెల్లించాలని మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దర్శనాల నగేష్ డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్యామల దేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ప్రతినెల 5వ తేదిలోపు వేతనాలు చెల్లించాలని, ఐదు నెలల ఈపీఎఫ్ డబ్బులు ఈపీఎఫ్ ఖాతాలో జమ చేయాలన్నారు. ఈఎస్ఐ డబ్బులు కార్మికుల ఖాతాల నుండి కోత విధిస్తున్నారని తెలిపారు. అయిన ఇప్పటివరకు ఏ ఒక్క కార్మికునికి ఈపీఎఫ్ కార్డ్ ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించబోయే రెండవ పీఆర్సీలో కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను మిక్స్‌పై కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ వాటర్ సెక్షన్ ప్రెసిడెంట్ అడ్డూరి ఆత్మారాం, డ్రైవర్ సెక్షన్ ప్రెసిడెంట్ ఎం జనార్ధన్, అజీమ్, శివ ప్రసాద్, గంగన్న, భూమన్న, శ్యామ్ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీయడానికే యువజనోత్సవం

- జడ్పీ డిప్యూటి సీఈఓ కలిందిని
- ఆకట్టుకున్న గుస్సాడీ, సాంస్కృతిక కార్యక్రమాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యువతలోని ప్రతిభను వెలికి తీయడానికి యువజనోత్సవం ఎంతో ఉపయోగపడుతుందని జడ్పీ డిప్యూటి సీఈఓ కలిందిని అన్నారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌ను ఆమె ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం గుస్సాడి నృత్యాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ కళాశాలలు, పాఠశాల విద్యార్థులతో పాటు కళాకారులు కూడా ఇందులో పాల్గొని ఉత్సహపరిచారు. స్టేజీపై జరుగుతున్న నృత్యాలను చూస్తు మిగిత విద్యార్థులు కేరింతలు కొట్టారు. అంతకు ముందు ముఖ్య అథితులను గుస్సాడి నృత్యంతో స్వాగతించారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను వారి సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతనులోని నైపుణ్యాలను వెలికి తీసేలా ప్రతి ఏటా యూత్ ఫెస్టివల్ నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా స్థాయిలో రాణించిన వారికి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఆదిలాబాద్ లాంటి వెనకబడిన ప్రాంతంలో చాలా నైపుణ్యం ఉందని, యువత ఇలాంటి వేదికలను వినియోగించుకుంటూ వాటిని ప్రపంచానికి పరిచయం చేయలన్నారు. పోటీల్లో గెలుపొటలము సహజమని, ఓటమిని పాఠంలా స్వీకరించి గెలుపు కోసం సన్నద్ధంకావాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, విజయ డెయిరీ డీడీ మధుసుధన్, డీఐఈఓ రవీందర్, న్యాయనిర్ణేతలు కబీర్ దాస్, సతీష్ దేశ్పాండే, సల్ల విజయబాబు, ప్రతాప్ సింగ్, జగదీష్, వజ్రమాల, కవిత, వ్యాఖ్యత మసుద్ పాల్గొన్నారు.



స్పందించి.. సర్దుబాటు చేసి

నవతెలంగాణ-తాంసి

మండలంలోని పొన్నారి ప్రాథమిక పాఠశాలలో గతంలో పనిచేసిన ఇద్దరు ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ కావడంతో ఒక ఉపాధ్యాయురాలు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మరో ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్ రాజర్షి షాను కలిసి విన్నవించారు. స్పందించిన కలెక్టర్ సర్దుబాటు ద్వారా ఆ పాఠశాలకు ఉపాధ్యాయున్ని పంపించారు. 73 మంది విద్యార్థులు పాఠశాలలో చదువుకోవడం ఒకే ఒక ఉపాధ్యాయురాలు విధులు నిర్వహించడంతో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ స్పందించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. డిప్యూటేషన్‌పై తాంసి మండలంలో మిగిలి ఉపాధ్యాయులు లేకపోవడంతో తలమడుగు ఎస్జీటీ ఉపాధ్యాయుడు ఎస్ వెంకటరమణను పొన్నారి స్కూలుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా ఆయన విధుల్లో చేరారు. అదే స్కూల్లో పనిచేస్తున్న టీచర్ సరిత వెంకటరమణ భార్యభర్తలు కావడం ఒకే స్కూల్లో విధులు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

కంటి శిబిరానికి అనూహ్య స్పందన



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మాసం కిరణ్ మొదటి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. 300 మందికి కంటి పరీక్షలకు నిర్వహించారు. ఈ సందర్భంగా మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్ మాట్లాడుతూ మా అన్న మాసం కిరణ్ మొదటి వర్ధంతి సందర్భంగా ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 50 మందికి సొసైటీ ద్వారా త్వరలో అద్దాలు, ఆపరేషన్ చేయించడం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ విజన్ సెంటర్‌కో ఆర్డినేటర్ సిరగడ వెంకట రమణ, టెక్నీషియన్‌లు ఆత్రం గజనంద్, దేశగనీ కృష్ణ, అమిత్, సభ్యులు కదేరుగుల ఆనంద్, జాదవ్ కృష్ణ పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకుడు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మకంటి మహేష్ కుమార్ గౌడ్‌ను ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్ టీపీసీసీ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోటీ చేసినట్లు ఆయనకు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితిపై కాసేపు చర్చించారు.

వర్షాకాల వ్యాధులపై అవగాహన



నవతెలంగాణ-నార్నూర్

వర్షాకాలం నేపథ్యంలో ముందస్తు ప్రణాళికలలో భాగంగా బుధవారం మండలంలోని బాబేఝరీ, మాంజ్రీ గ్రామాల్లో వైద్య సిబ్బంది జాతీయ కీటక జనిత ఆరోగ్య అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో హెల్త్ సూపర్‌వైజర్ చరణ్ దాస్, ఎంఎల్‌హెచ్‌పీ హిమాబిందు ఆధ్వర్యంలో 36 మందిని పరీక్షించి ఉచిత మందులు పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఇందులో వైద్య సిబ్బంది మాన్కుబాయి, జవహర్ లాల్, అంగన్‌వాడీ టీచర్ అమృత, ఆశా కార్యకర్తలు గంగుబాయి, రూపా బాయి ఉన్నారు.

గోలి శంకర్ మరణం తీరని లోటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గోలి శంకర్ మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. పట్టణంలోని మహాలక్ష్మి వాడకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు గోలి శంకర్ మంగళవారం గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న జోగురామన్న సంతాపం వ్యక్తం చేశారు. కాగా బుధవారం ఉదయం గోలి శంకర్ అంత్యక్రియలను నిర్వహించగా జోగురామన్న, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పాల్గొన్నారు. పార్థివ దేహంపై పార్టీ కండువా కప్పి వీడ్కోలు పలికారు. ఆయన మరణం పార్టీకి, కుటుంబ సభ్యులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.



నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | సెప్టెంబర్ 26, 2024 | www.navatelangana.com
3

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



ఖాతాదారులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎలుకపెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు లావాదేవీల గురించి, డిపాజిట్, పొదుపు, ఇన్సూరెన్స్ పథకాల గురించి కళాజాత బృందం పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకులో ఖాతాదారులకు అనేక సేవలు ఉంటాయని, ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ కట్టుకోవాలని, మొబైల్ బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీలు జరుపుకోవాలని, అలాగే బ్యాంకు ద్వారా పంట రుణాలు, రైతు నేస్తం, వ్యాపార రుణాలు తీసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో టీజీబీ ఎలుకపెల్లి గ్రామీణ బ్యాంకు మేనేజర్ రామకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ గోపి కిషోర్, ఏపీఎం కోనయ్య, ఖాతాదారులు పాల్గొన్నారు.

వావుదాం పాఠశాలకు నూతన భవనం నిర్మించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని వావుదాం గిరిజన పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ డిమాండ్ చేశారు. బుధవారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే పరిస్థితిపై కలెక్టర్‌తో పాటు ప్రజాప్రతినిధులకు వివరించినట్లు తెలిపారు. వెంటనే పాఠశాలకు నూతన భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రుణం పేరుతో మోసం

నవతెలంగాణ-దహెగాం

రోజుకు ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నాయని ప్రతి ఒక్కరూ మోసానికి గురికాకుండా జాగ్రత్తగా ఉండాలంటూ ఒకవైపు పోలీసులు నెత్తి నోరు కొట్టుకుంటూ ప్రతిరోజు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న యువత ఎక్కడో ఒకచోట ఏదో రూపంలో మోసానికి గురవుతూనే ఉన్నారు. తాజాగా మండలంలోని బ్రాహ్మణ చిచ్చాలకు చెందిన దేశ్‌ముకు సంజీవ్ ఆన్‌లైన్ మోసానికి గురయ్యాడు. బాధితుడు, ఎస్సై కందూరి రాజు తెలిపిన వివరాల ప్రకారం... బ్రాహ్మణ చిచ్చాల గ్రామానికి చెందిన దేశ్‌ముకుల సంజీవ్ మార్చి నెలలో యూట్యూబ్‌లో వీడియోలు చూస్తున్నారు. ధని ఫైనాన్స్ యాడ్ వచ్చింది. లింక్‌పై క్లిక్ చేసి లోన్ కోసం అప్లై చేశాడు. రెండో రోజు ఒక మొబైల్ నంబర్ నుండి కాల్ చేసి డాక్యుమెంట్ చార్జీలకు రూ. 6550 ఫోన్ పే చేయ్యాలని చెప్పాడు. దీంతో సంజీవ్ డబ్బులు ఫోన్ పే చేశాడు. అరగంట తర్వాత కాల్ చేసి మేము లోన్ డబ్బులు పంపాము అకౌంట్‌లో చెక్ చేసుకొమ్మని చెప్పాడు. సంజీవ్ అకౌంట్ చెక్ చేసుకొని డబ్బులు రాలేదని చెప్పాడు. ఫస్ట్ ఇన్‌స్టాల్‌మెంట్ రూ.24698 కడితే డబ్బులు మీ అకౌంట్‌లో పడతాయని నమ్మబలికాడు. దీంతో సంజీవ్ తొలికిస్తు కట్టాడు. గంట తరువాత డబ్బులు జామకాలేదని ఫోన్ చేయ్యగా ఎక్కువ ఎమౌంట్ కదా ఇంకో కిస్తు కూడా పే చేయమనడంతో అనుమానం వచ్చి నాకు లోన్ వద్దు నా డబ్బులు నాకు పంపామన్నాడు. మరో నాలుగు వేలు కడితే నీ డబ్బులు నీకు వస్తాయి అనడంతో మోసపోయానని గ్రహించి మిత్రుల సాయంతో సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి కాల్ చేసి కంప్లైంట్ చేయడంతో రూ.31,248 హోల్డ్‌లో పెట్టారు. ఈ మేరకు దేశ్‌ముకుల సంజీవ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్సై కందూరి రాజు తెలిపారు.

20 లీటర్ల గుడుంబా పట్టివేత

నవతెలంగాణ-చింతలమానేపల్లి



అక్రమంగా ద్విచక్ర వాహనం తరలిస్తున్న 20 లీటర్ల గుడుంబాను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్సై ఇస్లావత్ నరేష్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. గూడెం నుండి ద్విచక్ర వాహనంపై చింతలమానేపల్లికి జాడే కుమార్ వస్తున్నాడు. తనిఖీ చేయగా అతని వద్ద 20 లీటర్లు గుడుంబా లభ్యం అయింది. ఆయన వద్ద నుండి గుడుంబాను స్వాధీనం చేసుకొని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం జాడే కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

భీం ఉత్సవ కమిటీ చైర్మెన్‌గా పెందూర్ రాజేశ్వర్

నవతెలంగాన-కెరమెరి



చైర్మెన్ పెందూర్ రాజేశ్వర్

కుమురం భీం వర్ధంతి ఉత్సవ కమిటీ చైర్మెన్‌గా పెందూర్ రాజేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని జోడేఘాట్‌లో బుధవారం ఉత్సవ నిర్వహణపై రాయిసెంటర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఆదివాసుల సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు హాజరయ్యారు. వచ్చే నెలలో ఆదివాసుల ఆరాధ్యాదైవం కుమురం భీం వర్ధంతిని నిర్వహించనున్న నేపథ్యంతో భీం ఉత్సవ నిర్వాహణ కమిటీని ఎన్నుకొగ భీం మనవడు కుమురం సోనేరావ్ హాజరై కమిటీని తెలియజేశారు. చైర్మెన్‌గా పెందూర్ రాజేశ్వర్, కన్వీనర్‌గా పెందూర్ మోతిరాం, ఉపాధ్యక్షులుగా మాడావి రాఘునాథ్, చహకటి మారు, కార్యదర్శులుగా మూట ఎల్లయ్య, బోడ్కే రామారావ్, కోశాధికారులుగా రాయి సిడాం జంగు, కోవ విజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా కుమురం లింగోరావు, వెడ్మ సీతారం, సంస్కృతిక కార్యదర్శులుగా కనక ప్రభాకర్, సిడాం ధర్ము, ఆత్రం ధర్ము, సలహాదారులుగా ఆత్రం బొజ్జరావు, కుమురం భగవంత్‌రావు, రాయిసిడాం జంగు, ఆత్రం లక్ష్మణ్, మాడావి భీము, సిడాం జగన్నాథ్ రావు, కోవ దేవురావు, అనక దేవురావు, కొరేంగ గోవింద్‌రావు తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం వారిని సత్కరించి అభినందనలు తెలిపారు.



కన్వీనర్ పెందూర్ మోతీరాం

ప్రతిభ చాటిన విద్యార్థికి సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న అదే తిరుపతి అమన్ రాజధాని జోర్డాన్‌లో జరిగిన పదవ అంతర్జాతీయ హ్యాండ్ బాల్ పురుషుల ఛాంపియన్‌షిప్ క్రీడా పోటీల్లో దేశం తరపున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల ప్రిన్సిపాల్ అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరచడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సట్ల శంకర్, పీఈటీ కోట యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన వాటర్ స్ప్రే వాహనం ప్రారంభం

నవతెలంగాణ-రెబ్బెన

ఖైర్‌గూడ ఓపెన్ కాస్ట్ నూతనంగా కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వాటర్ స్ప్రే యంత్రాన్ని ప్రాజెక్ట్ ఆఫీసర్ నరేందర్, గని మేనేజర్ శంకర్ నాయక్, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మీకు చంద్రశేఖర్ ప్రారంభించారు. ఓపెన్ కాస్ట్ ఏరియాలో ఖైర్‌గూడ నుండి సీహెచ్‌పీ వరకు నూతన స్ప్రే వాహనాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. దీన్ని సక్రమంగా వినియోగించుకొని రోడ్లపై డస్ట్ నిర్మూలిండానికి పాటుపడాలని ప్రాజెక్ట్ ఆఫీసర్ కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇంజనీర్ వీరన్న, సేఫ్టీ ఆఫీసర్ రాజేశ్వరరావు, ఇన్‌చార్జి మేనేజర్ నారాయణ, సూర్యనారాయణ, సీనియర్ పీఓ నాగుల వేణు, కాంటాక్ట్ రాజు పాల్గొన్నారు.

టాస్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

జిల్లాలో అక్టోబర్ 3 నుండి 9వ తేదీ వరకు జరగనున్న ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలు సజావుగా జరిగే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరిగే ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలను అధికారులు సమన్వయంతో ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఇంటర్ పరీక్షలకు జనకపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎస్ఎస్‌సీ పరీక్షలకు 165 మంది విద్యార్థులు, ఇంటర్ పరీక్షలకు 110 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు ఏర్పాట్లతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, పరీక్షల సమయానికి అనుగుణంగా విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపించాలని తెలిపారు. పరీక్ష సంబంధిత ప్రశ్నపత్రాలను పోలీసు బందోబస్తు మధ్య తరలించాలని, పరీక్ష జరిగే సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షలు సజావుగా సాగేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా విద్యాధికారి ఉదయ్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, ఆసిఫాబాద్ టౌన్ సీఐ సతీష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యాన్ని కల్పించేలా చూస్తాం



పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తీవారి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని మురళీగూడ గ్రామస్తులకు తాత్కాలిక రోడ్డు సౌకర్యం కల్పించే విధంగా కృషి చేస్తామని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. బుధవారం మండలంలోని మురళీగూడ గ్రామంలో వారు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై గ్రామ సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్తులు రోడ్డు సౌకర్యం కల్పించాలని వారికి విన్నవించగా తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామంలోని పాఠశాలను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కమ్మర్‌గాం గ్రామంలో ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేలా చూస్తామన్నారు. కమ్మర్‌గాం, దిగిడ గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగు వంతెనను పరిశీలించారు. అంతకు ముందు మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించి ప్రతిరోజు వచ్చే రోగుల వివరాలను నమోదు చేయాలని, ఎంతమంది రోగులు వస్తున్నారని తెలుసుకున్నారు. అలాగే ఆపరేషన్ థియేటర్‌ను, మందుల గదిని, వ్యాక్సినేషన్ గదిని పరిశీలించారు. ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందేలా కృషి చేయాలని వైద్యురాలుకు సూచించారు. ఆస్పత్రిలో స్లాబ్ నుండి వర్షపు నీరు కారుతుందని అదనపు కలెక్టర్‌కు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచించారు. గ్రామస్తులు ఆయనతో మాట్లాడుతూ ఆస్పత్రికి రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని కోరాగ డీఎంహెచ్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఆల్బర్ట్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వయోవృద్ధులు భావితరాలకు మార్గదర్శకులు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అధికారులు, వయోవృద్ధుల సంఘం నాయకులు

వయోవృద్ధులు భావితరాలకు మార్గదర్శకులని, వారి సంక్షేమం మన అందరి బాధ్యతని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో నిర్వహిస్తున్న వయోవృద్ధుల అవగాహన, వినోదాల వారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. వయోవృద్ధులను కాపాడుకోవాలని, వారి పట్ల గౌరవభావం కలిగి ఉండాలని, శ్రేయస్సుకు అందరం కషి చేద్దామన్నారు. వారి హక్కులను తెలియజేసి సంక్షేమ చట్టాలపై అవగాహన కల్పించాలని, వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న వృద్ధాశ్రమాలలో వృద్ధులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాకతాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం, ఆరోగ్య రక్షణపై అవగాహన కార్యక్రమాలు, 29న గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మాజీ ప్రజా ప్రతినిధులతో తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టంపై అవగాహన కార్యక్రమాలు, 30న అంగన్‌వాడీ కేంద్రాలలో గ్రాండ్ పేరెంట్స్ డే, మానవ సంబంధాలు-విలువలు ఇతర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 1న జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో సమావేశం ఏర్పాటు చేసి జిల్లా స్థాయి ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు వయోవద్ధుల దినోత్సవ ప్రత్యేక కార్యక్రమాలను సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలన్నారు. అనంతరం అందరితో వయోవృద్ధుల సంక్షేమ ప్రతిజ్ఞ చేయించి ప్రత్యేక కార్యక్రమాలు సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు గుండ శంకర్, పెద్దింటి లక్ష్మణరావు, విజయ్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసులకు డ్యూటీ మీట్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా పోలీసు కార్యాలయంలో కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్ హ్యాండ్లింగ్ లిఫ్టింగ్ ప్యాకింగ్, బాంబు డిస్పోజల్ స్క్వాడ్, పోలీస్ జాగిలలు వివిధ విభాగాలలో ట్రాకింగ్ ఎక్స్ క్లూసివ్ విభాగాల్లో సిబ్బందికి డ్యూటీ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు వివరాలు వెల్లడిస్తూ వివిధ రకాల విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని జోనల్ రాష్ట్రస్థాయి డ్యూటీ మీట్‌కు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అన్ని విభాగాలలో కలిపి 30 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారని, నేర నిర్ధారణలో సిబ్బంది కనబరిచే పనితీరును ఆధారంగా జోనల్ లెవెల్ పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 14 నుండి 18 తేదీల వరకు జరిగే మొదటి తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌కు పంపిస్తామన్నారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మెడల్స్‌తో పాటు నగదు బహుమతి, సాలరీలలో బహుళ ఇంక్రిమెంట్స్ ఇవ్వడం జరుగుతుందని వివరించారు.



రేపు ఉమ్మడి జిల్లా బాల్ బాడ్మింటన్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటి సింగరేణి హై స్కూల్ గ్రౌండ్‌లో అండర్ 19 బాల్ బాడ్మింటన్ బాల బాలికల పోటీలను శుక్రవారం నిర్వహించడం జరుగుతుందని ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ నారాయణ రెడ్డి తెలిపారు. ఎంపికైన బాల బాలికలు వచ్చే నెల అక్టోబర్ నెల 4 నుండి 6 వరకు కామారెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో జిల్లా స్థాయి తరుపున పాల్గొంటారన్నారు. 02 జనవరి 2005 నుండి జన్మించిన వారు అర్హులుని, క్రీడాకారులు ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు. ఇతర వివరాలకు సింగరేణి హైస్కూల్ పీఈటీ కె.భాస్కర్ సెల్ 9381662413ను సంప్రదించాలన్నారు.

ఆన్‌లైన్ సేవలను పునరుద్ధరించాలి

నవతెలంగాణ-కెరమెరి

ఈనెల 4 నుంచి మండల కేంద్రంలో నిలిపివేసిన ఆన్‌లైన్ సేవలను పునరుద్దరించాలని ఆన్‌లైన్‌సెంటర్ల నిర్వాహకులు కోరారు. బుధవారం డిప్యూటి తహసీల్దార్ సంతోష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆన్‌లైన్ కేంద్రంతోనే కుటుంబాన్ని పోశించుకున్నామని నిర్వాహకులు తెలిపారు. 20 రోజుల నుంచి నెట్‌లేని కారణంగా వ్యాపారం జరగడం లేదన్నారు. కేంద్రాలపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు. ఆన్‌లైన్ కేంద్రాలకు ప్రత్యామ్నయంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆన్‌లైన్ నిర్వాహకులు లెన్గురే బాలాజీ, మున్నజీ, దేవేందర్, ఉమకాంత్, శంకర్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. బుధవారం కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీకాంత్‌తో కలిసి మున్సిపల్ కార్యాలయం నుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న 144 మంది కార్మికులను మున్సిపల్ కార్మికులుగా తీసుకోవాలని, జీఓ నెంబర్ 60 ప్రకారంగా కేటగిరి వైజ్‌గా వేతనాలు చెల్లించాలన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు మాట్ల రాజయ్య, తోట సమ్మయ్య, నాయకులు పద్మ సుజాత, మోతలక్ష్మి, పెంటుబాయి, సంధ్య, కళావతి, దుర్గ ప్రసాద్, నక్క మల్లేష్, శ్రీనివాస్, అశోక్, నగేష్, జగ్గారావు, సాగర్, ప్రభాకర్, రాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాల మైదానంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్, సాంఘిక సంక్షేమ గురుకుల ప్రిన్సిపాల్ అబ్దుల్ రహీంల ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీలకు పురుషులు మహిళలు 250 మందికి పైగా పాల్గొన్నారని, 21 మందితో పురుషుల ప్రాబబుల్స్, 21 మందితో మహిళల ప్రాబబుల్స్ ఎంపిక చేసినట్టు తెలిపారు. ఎంపికైన వీరికి అక్టోబర్ 2న వరకు ప్రత్యేక క్యాంపు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 16 మందితో తుది జట్టు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన జట్లు అక్టోబర్ 9, 10, 11 తేదీల్లో రంగారెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో క్రీడ పాఠశాల హెడ్‌ఎం జంగు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సట్ల శంకర్, గిరిజన ఆశ్రమ పాఠశాలల క్రీడాధికారి మీనా రెడ్డి, సాఫ్ట్ బేస్‌బాల్ కార్యదర్శి గురువెందర్, హ్యాండ్ బాల్ నేషనల్ రిఫరీ కళ్యాణ్, కోచ్‌లు అరవింద్, రాకేష్, రవి, పీడీ, పీఈటీలు గౌరీ, హరిక, చిన్నక్క, యాదగిరి, వెంకటేష్ పాల్గొన్నారు.

నర్సరీ కార్మికులకు కూడా లాభాల వాటా చెల్లించాలి

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరికీ లాభాల వాట చెల్లించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం వైస్ ప్రెసిడెంట్ మల్‌రాజ్ శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. బుధవారం గోలేటిలోని నర్సరీ కార్మికులను కలిసి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనిట్ రేటున పనిచేస్తున్న నర్సరీ కార్మికులు, వాహన డ్రైవర్లు, ఓబీ కాంట్రాక్ట్ కార్మికులకు కూడా లాభాలో వాటా చెల్లించాలని యాజమాన్యాన్ని కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మంగీలాల్, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేష్, అలవేణి సంపత్, సెంట్రల్ నాయకులు ఓరం కిరణ్, మంత్ సమ్మయ్య, అనుముల సత్యనారాయణ, బాబురావు, బొంగు వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో గిరి విద్యార్థినుల ప్రతిభ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

హ్యాండ్ బాల్ ఇంటర్ కళాశాలల పోటీలలో జిల్లా కేంద్రంలోని గిరిజన మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. ప్రిన్సిపాల్ శారద పిడి హారికతో కలిసి విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీతో పాటు వాగ్దేవి పారా మెడికల్ కళాశాలలో ఈనెల 21 నుండి 23 వరకు నిర్వహించిన ఇంటర్ కళాశాలల టోర్నమెంట్ పోటీలలో ప్రతిభ కనబరిచి కరీనా, తేజశ్రీలు సౌత్ జోన్ హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరితో పాటు బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హాండ్ బాల్ పోటీలలో ఎంపికైన ప్రాబబుల్స్‌లో ఏడు మంది తమ కళాశాలకు చెందిన విద్యార్థులు కావడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థినుల క్రీడాభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రేపు షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 27న జూనియర్ అండర్-19 షూటింగ్ బాల్ ఆసిఫాబాద్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుర్గం గురువేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు గిరిజన మహిళ జూనియర్ కళాశాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల వారు ఫిజికల్ డైరెక్టర్ భవిత, పీఈటీ చిన్నక్కలకు రిపోర్ట్ చేయాలన్నారు. ఇతర వివరాలకు 8639823485, 9948139687 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | సెప్టెంబర్, 26 2024 | www.navatelangana.com

రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం



రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తప్పకుండా తీసుకోవాలని జన్నారం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ సూచించారు. బుధవారం మండలంలోని తపాలాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షను నిర్వహించారు. అలాగే అంగన్‌వాడీ చిన్నారులకు ఎత్తు, బరువు కొలిచారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కిషోర్ బాలికలు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కమలాకర్, ఎంఎల్‌హెచ్‌పీ సందీప్, అంగన్‌వాడీ టీచర్లు కవితా శ్రీవాణి, సునీత, ఏఎన్ఎం మాధవి, ఆశా రజిత, మమత పాల్గొన్నారు.

యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-తాండూర్



మండలంలోని రేపల్లెవాడలో గల సెయింట్ థెరిస్సా హై స్కూల్ విద్యార్థులు మంచిర్యాల జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ యోగా పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ బ్రదర్ ఆంటోనీ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు అండర్-17 బాయ్స్ విభాగంలో జేశ్వంత్ జిల్లా మొదటి స్థానం, మొక్షిత్ 5వ స్థానంలో నిలిచారు. అండర్-14 బాయ్స్ విభాగంలో అఖిలేష్, 3వ స్థానంలో సాయి వర్ధన్ 5వ స్థానం కైవసం చేసుకున్నారు. జిల్లా స్థాయిలో ఎంపిక అయిన విద్యార్థులకు చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు చేతుల మీదుగా బహుమతి అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థులను యోగా టీచర్స్ వామన్, చంద్రకళ, పీఈటి శ్రీకాంత్, మాంతయ్య అభినందించారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు నిర్దీత గడవులోగా పరిష్కరించాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్టీపీపీ ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ ఎస్వీ రాజశేఖర్ రావును కలిసి ఆయన కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై చర్చించారు. ప్లాంట్ ప్రభావిత గ్రామాలకు చెందిన వారితో పాటు నిర్వాసితులైన కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగాలు పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను గౌరవిస్తున్న తీరును గుర్తించాలని 20 రోజుల వ్యవధితో కాంట్రాక్టు కార్మికుల సమస్యల పట్ల సింగరేణి సీఎండీ లేదా డైరెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు డిప్యూటీ లేబర్ కమీషనర్ హామీని ఈ సంధర్భంగా గుర్తు చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు హక్కుల సాధనకు సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యాజమాన్యం సానుకూలంగా స్పందించకుంటే కాంట్రాక్టు కార్మికులు సమ్మె చేయడానికి సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు తిప్పారపు సారయ్య, అనిల్ రెడ్డి, విక్రం, ప్రదీప్‌రెడ్డి, సాయి కృష్ణారెడ్డి, సంపత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్సీ సబ్ ప్లాన్ అమలు చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

దేశవ్యాప్తంగా ఎస్సీ సబ్ ప్లాన్ చట్టం అమలుతో పాటు రాష్ట్ర అసెంబ్లీలో జనాభా ఆధారంగా బడ్జెట్ను కేటాయించాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న అన్నారు. బుధవారం డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం అదనపు కలెక్టర్ మోతిలాలకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రయివేటు రంగాల్లో దళితులకు రిజర్వేషన్ అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణను నిలిపివేయాలన్నారు. ఎస్సీ ఇండస్ట్రీ సబ్సిడీ నిధులను విడుదల చేయాలని, ఎస్సీ కార్పొరేషన్ లబ్దిదారులకు సబ్సిడీ నిధులను విడుదల చేయాలని, నూతనంగా ఎస్సీ కార్పొరేషన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. దళితులపై దౌర్జన్యాలు అంటరానితనాన్ని తక్షణమే నిలిపివేయాలని, భారత రాజ్యాంగం ప్రకారం దళితులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను కల్పించాలని కోరారు. దళితులకు విద్యా ఉద్యోగ, ఉపాధి, అవకాశాలు కల్పించాలని దళితులకు మూడు ఎకరాల భూమి దళిత బంధు పథకాలను పున ప్రారంభించాలని, సాధారణ జనాభాతో పాటు సామాజిక, ఆర్థిక కులగణన నిర్వహించాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జాడి పోచన్న, మేదరి దేవవరం, రెడ్డి రమణ, దుర్గం దేవదాస్, పొనగంటి యోసేపు, జాడి దుర్గ ప్రసాద్, రామ్ సాగర్, దిండిగాల సతీష్, సురిమిల్ల రవీందర్, గాజుల రవికుమార్, నర్సింగరావు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మొగిలి లక్ష్మణ్ పాల్గొన్నారు.

కాసిపేట-2 గనిపై ఐఎన్‌టీయూసీ 'బాయి బాట'



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో బుధవారం 'బాయి బాట' కార్యక్రమం నిర్వహించారు. గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య అధ్వర్యంలో బాయి బాట కార్యక్రమం చేపట్టి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేవి భూమయ్య మాట్లాడుతూ లాభాల వాటా విషయంలో కొన్ని సంఘాలు అసత్య ప్రచారాలు చేస్తూ కార్మికులను గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు. లాభాల వాటా 33 శాతం ఇప్పించడంలో ఐఎన్టీయూసీ కార్మికుల పక్షాన పని చేసిందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కూడా ఒక్కొక్కరికి లాభాల వాటా రూ.5000 ఇప్పించే ఘనత ఐఎన్టీయూసీదే అని, అది ఓర్వలేక కొన్ని సంఘాలు జీర్ణించుకోలేక పోతున్నాయని దీనిని కార్మిక వర్గం అర్థం చేసుకోవాలని వివరించారు. అనంతరం గనిలో నెలకొన్న పలు సమస్యలను గని మేనేజర్ వివరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ మెంబర్ నరేందర్, కాసిపేట-2 గని ఫిట్ సెక్రెటరీ కారుకూరి తిరుపతి, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ చింతం రవికిరణ్, నాయకులు గొల్ల రాజేందర్, రెమ్మ నిశాంత్, రెక్కల తిరుపతి, చంద్రశేఖర్, నెల్క సురేష్, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు సరికాదు



నవతెలంగాణ-మంచిర్యాల

ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చేసిన తప్పుడు ఆరోపణలు సరికాదని నస్పూర్ మున్సిపల్ చైర్మన్ వేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి తీవ్రంగా ఖండించారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అభివృద్ధి చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ రావులపై మండిపడ్డారు. ఎమ్మెల్యే కమీషన్ల కోసం గోదావరి నదిపై బ్రిడ్జి అడ్డుకుంటున్నాడని చేసిన ఆరోపణలను నిరూపించాలని సవాల్ చేశారు. మంచిర్యాలలో ట్రాఫిక్ సమస్య ఏర్పడవద్దనే ఉద్దేశ్యంతో ముల్కల్ల నుంచి బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యే సంకల్పించారన్నారు. కష్ట పడి డబ్బు సంపాదించిన వ్యక్తి ప్రేమ్‌సాగర్ రావు అని తెలిపారు. మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించే ప్రయత్నం చేయడం తగదని అన్నారు. తప్పుడు ప్రచారానికి పూనుకుంటే వచ్చే ఎన్నికల్లో డిపాజిట్ రాదని హితవు పలికారు. కాప్రా స్థలంపై వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని అన్నారు. స్థలం వివాదం కోర్టు పరిధిలో ఉందని, ఇప్పటికే ప్రేమసాగర్ రావు పక్షాన పలు తీర్పులు వచ్చాయని గుర్తు చేశారు. నడిపెల్లి విజిత్ రావు ప్రేమ్ సాగర్ రావుపై పోటీ చేస్తానని సవాల్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దమ్ముంటే తనపై పోటీ చేయాలని వేణు ప్రతిసవాల్ చేశారు. దివాకర్ రావు వృద్ధుడు అయ్యాడని రాజకీయాల నుంచి నిష్క్రమించడం ఉత్తమమని అన్నారు. దివాకర్ రావు చేసే ఆరోపణలలో పస లేదని ఎద్దేవాచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం దిశగా చర్యలు

నవతెలంగాణ-నస్పూర్



ప్రభుత్వం ట్రాన్స్ జెండర్ల సంక్షేమం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ క్రమంలో గుర్తింపు ధ్రువీకరణ పత్రాలు అందిస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో ఇన్‌చార్జి జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వరూపారాణితో కలిసి ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్ల సంక్షేమంలో భాగంగా మంచిర్యాల పట్టణానికి చెందిన ముగ్గురు లింగమార్పిడి వ్యక్తులు దరఖాస్తు చేసుకోగా గుర్తింపు పత్రాలు అందజేశారు. ఈ పత్రం ద్వారా ఉపకార వేతనాలు, స్కిల్ డెవలప్మెంట్, ట్రైనింగ్, కాంపోజిట్ మెడికల్ హెల్త్, గరిమా గ్రేహ్లో ఆశ్రయం, ఇతర ప్రయోజనాలతో పాటు ప్రభుత్వం నుంచి సపోర్ట్ ఫర్ లైవ్లీహుడ్ అండ్ ఎంటర్ప్రైజ్ (స్మైల్) పథకం క్రింద సంక్షేమ చర్యలతో సహాయం అందుతుందని తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌జెండర్.డీఓఎస్‌జేఈ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత శాఖ ఆధ్వర్యంలో నేషనల్ పోర్టల్ ఫర్ ట్రాన్స్జెండర్ పర్సన్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, లింగమార్పిడి వ్యక్తుల (హక్కుల రక్షణ) చట్టం-2019, 2020 ద్వారా గుర్తింపు కార్డులు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విదేశాలలో పని చేసేందుకు వివరాలు నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్పవర్ కంపెనీ లిమిటెడ్ (టీఓఎంసీఓఎం), తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్ రిక్రూట్మెంట్ ఏజెన్సీ ద్వారా నైపుణ్యం కలిగిన, సెమీ స్కిల్డ్ కార్మికులకు విదేశీలలో ఉపాధి సులభతరం చేసేందుకు సెప్టెంబర్ 27న ఎన్రోల్మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వై.రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలతో పాటు ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, జపాన్, పోలాండ్, రొమేనియా, యూకే వంటి వివిధ దేశాలలో ప్రభుత్వ, ప్రయివేట్ నమోదిత ఏజెన్సీలతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకుందని, యూఏఈలో మెకానికల్, ఎలక్ట్రికల్, బీఎంఎస్ ఆపరేటర్, ఎంఈపీ టెక్నీషియన్, సూపర్‌వైజర్లకు అధిక డిమాండ్ ఉందని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా ఐటీఐ, డిప్లొమా, బి.టెక్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. కనీసం 2 నుండి 4 సంవత్సరాల అనుభవం, 20-45 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని, కార్పెంటర్లు, మేసన్లు, స్టీల్ ఫిక్సర్లు, సహాయకులకు కనీసం 2 సంసవత్సరాల అనుభవం, 20-40 మధ్య వయస్సు ఉండాలని, ఆకర్షణీయమైన జీతం ప్యాకేజీతో, సురక్షితమైన, చట్టబద్ధమైన వలస మార్గాల ద్వారా రిక్రూట్మెంట్ ప్రక్రియ నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ నవీకరించిన రెస్యూమ్‌ను టీఓఎంసీఓఎం.రెస్యూమ్ జీమేయిల్‌కు ఈ-మెయిల్ చేయాలని, ఇతర వివరాల కొరకు ఆన్లైన్లో టీఓఎంసీఓఎం.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని, 9985483931, 7995957779, 7893566493 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి, ఎంపీడీఓ శశికళ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం వారు పడుకునే డార్మెంటరీలను పరిశీలించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని హాస్టల్ నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ జలంధర్, ఈఓ రాహుల్ పాల్గొన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో పచ్చదనం, పరిశుభ్రత

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట, బెల్లంపల్లి మండలాల శివారులో ఉన్న బుగ్గ దేవాలయం పరిసరాల్లో బుధవారం ఆటవీ శాఖ అధికారులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ క్షేత్ర అధికారి సీహెచ్ పూర్ణచందర్ మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత పాటించాలని, దాని వలన గ్రామీణ భారతదేశంలో సంపూర్ణ పారిశుధ్యం సాధించే దిశగా చెత్త రహిత భారతదేశం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ స్వచ్ఛతహి సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. అందులో భాగంగా ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను అలాగే అడవిలో ప్లాస్టిక్ను వాడకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు బి ప్రవీణ్ నాయక్, గౌరీ శంకర్, తిరుపతి, సతీష్, ఎఫ్ఎస్వో ప్రభాకర్ రావు, ఎఫ్బీవోలు యుగేంధర్, కుమార స్వామి, శంకర్, రాజు, శ్రీధర్, గోపీకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

వేధిస్తున్న సీనియర్ అసిస్టెంట్ పై చర్య తీసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం



ఉద్యోగ రీత్యా తనను వేదిస్తున్న జన్నారం అటవీ డివిజన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శమీమోద్దిన్‌పై చర్య తీసుకోవాలని అదే కార్యాలయానికి ఇటవల బదిలీపై వచ్చిన సీనియర్ అసిస్టెంట్ టీ సవిత కోరారు. బుదవారం అటవీ డివిజన్ కార్యాలయం ముందు ఏర్పాటుచేసిన విలేకరులతో ఆమె మాట్లాడారు. జన్నారం ఫారెస్ట్ డివిజన్ కార్యాలయంలో సూపరింటెండెంట్ పోస్టు ఖాళీగా ఉండటంతో సీనియర్ అసిస్టెంట్ శమిమోద్దిన్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు. ఇటీవల బదిలీపై ఇక్కడికి వచ్చిన తనను శమీమోద్దిన్ కంటే తాను సీనియర్ కావడంతో సూపరింటెండెంట్ నిబంధనల ప్రకారం తనకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వవలసి ఉందని, దీంతో తను మళ్లీ సీనియర్ అసిస్టెంట్‌గానే ఉండవలసి వస్తుందనే ఆలోచనతో తనపై కుట్ర పన్నిన శమీమోద్దిన్ ప్రతిరోజు డ్యూటీకి సక్రమంగా రావడం లేదని తన మీద పై అధికారులకు చెప్పి డిప్యూటేషన్ పై పంపించేందుకు కుట్ర పన్ని అదేశాలు జారీ చేయించాడని ఆరోపించారు. దీంతో తాను కాలేశ్వరం జోన్ అటవీ అధికారి దగ్గరకు వెళ్లి తన డిప్యూటేషన్ ఆర్డర్‌ను రద్దు చేయించుకున్నానని తెలిపారు. అయినప్పటికీ శమీమోద్దీన్ తన తీరును మార్చు కోక తన వేతనాన్ని ఆపేసి తనను మానసికంగా వేదిస్తున్నాడని అన్నారు. దసరా పండుగ తన మీదనే కుటుంబం ఆధారపడి ఉందని పండుగా ఎలా జరుపుకోవలని ఆదేవన వ్యక్తం చేశారు. తనను మానసికంగా వేదిస్తున్న శమీమోద్దిన్‌పై చర్యలు తీసుకోవాలని ఫారెస్ట్ జిల్లా ఆఫీసర్లకు ఫిర్యాదు సైతం చేస్తున్నానని పేర్కొన్నారు. గత 13 సంవత్సరాలుగా డివిజన్ ఆఫీస్ లోనే తిష్ట వేసిన శమీమోద్దిన్ ఆఫీస్‌లో పనిచేసే తనకన్న జూనియర్ ఉద్యోగులను వేదించిన సంఘటనలున్నాయని వీటిపై విచారణ జరిపి సీనియర్ అసిస్టెంట్ శమీమోద్దిన్‌పై తగిన చర్యలు తీసుకోవాలని ఫారెస్ట్ ఆఫీసర్లను కోరారు.

మండల విద్యాశాఖ అధికారి బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-వేమనపల్లి

మండల విద్యాశాఖ అధికారిగా బుధవారం బొబ్బిలి శ్రీధర్‌రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. శ్రీధర్‌రెడ్డి గతంలో జడ్పీహెచ్ఎస్ వేమనపల్లి కాంప్లెక్స్ హెచ్ఎంగా పనిచేశారు. ఇదివరకు ఎంఈఓగా పనిచేసిన తిరుపతిరెడ్డి సాధారణ బదిలీలలో భాగంగా ఘడ్‌పూర్ ప్రధానోపాధ్యాయులుగా హజీపూర్ మండల విద్యాశాఖ అధికారిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారికి ఉపాధ్యాయ సంఘం నేతలు ఉపాధ్యాయులు తోటి ఉద్యోగులు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పద్మశాలి సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిష్టాపూర్ గ్రామ పద్మశాలి సంఘం కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా వాసాల మహేష్ ఉపాధ్యక్షునిగా అయ్యోరి సత్తన్న ప్రధాన కార్యదర్శి వాసాల భాస్కర్ క్యాషియర్‌గా అంకం మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం సభ్యులు ఆడేపు లక్ష్మీనారాయణ, చిందం లచ్చన్న, గంగారపు మల్లేష్, హనుమండ్ల సత్తన్న, వేణు, వాసాల నరేష్, రవి, జోగు రాయమల్లు, మల్లేష్, సాంబారి పవన్, వాసాల శ్రీనివాస్, రవి, ఆడేపు బాపన్న, నామనీ భూమన్న, బొమ్మిడి రాజేందర్, తుమ్మ సతీష్ కట్కం శ్రీకాంత్ పాల్గొన్నారు.

28న మహాధర్నాను విజయవంతం చేయండి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



గురుకుల పాఠశాలల సమస్యల పరిష్కరించాలని ఈ నెల 28న చలో హైదరాబాద్ మహాధర్నాను విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు పిలుపు నిచ్చారు. బుధవారం పట్టణంలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, పీజీ ఎంజేపీ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 010 పద్దు కింద, ప్రతి నెల ఒకటో తారీఖున జీతాలు చెల్లించాలన్నారు. అశాస్త్రీయమైన కాలానిర్ణయ పట్టికను సవరించాలన్నారు. వార్డెన్‌లను, కేర్ టేకర్‌లను నియమించాలన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. విద్యార్థులకు సరిపడే వసతులు కల్పించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, మెస్ చార్జీలు పెంచలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్పకూడదన్నారు. స్వంత భవనాలు, ఉపాధ్యాయులకు క్వార్టర్స్ నిర్మించాలని, అన్ని గురుకులాలను కామన్ డైరెక్ట్ పరిధిలోకి తీసుకు రావాలన్నారు. పారిటీ స్కేల్స్ మంజూరు చేయాలన్నారు. ప్రిన్సిపల్స్‌కు, జూనియర్ లెక్చరర్‌లకు గజిటెడ్ హోదా కల్పించాలన్నారు. పార్ట్ టైమ్, కాంట్రాక్టు ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జి నర్సయ్య, జిల్లా కార్యదర్శి కె చంద్రమౌళి, మండల అధ్యక్షుడు బి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణ పరిధిలోని ఉత్కూర్‌లో సయ్యద్ ఇమామ్ షావలి సహబ్ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అక్కడ కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ దర్గా ఉత్సవాలు ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుకుంటామని, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఉత్సవాలకు ండలంలోని ప్రజలతో పాటు ఇతర చుట్టుపక్కల మండల ప్రజలు కూడా పాల్గొంటారని తెలిపారు. ఈ ఉత్సవంలో

నేటి కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయండి

నవతెలంగాణ-నస్పూర్

యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంగం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేష్, మిట్టపల్లి తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు పెండింగ్ ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలని కోరారు. స్కావెంజర్లను నియమించాలని, కస్తూర్బా పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. రాష్ట్రంలో డీఈఓ పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేయానలి కోరారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

రైతులు పత్తి, వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని బెల్లంపెల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.కోటశివకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని ఇటిక్యాల, జెండావెంకటాపూర్ గ్రామాల్లో క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిందె రాలటం, రసం పీల్చే పురుగులను గుర్తించడం జరిగిందని, అంతేగాక గులాబీ రంగు పురుగు, కాయకుళ్ళ తెగులు వంటి సమస్యలు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. అధిక తేమ బెట్ట వంటి ప్రతికూల పరిస్థితులలో పూత, పిందె రాలటం గమనించినప్పుడు 5 లీటర్ల నీటికి 1 మీలీ ప్లానోఫిక్స్ కలిపి 10 - 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేసుకోవాలని సూచించారు. రసం పీల్చే పురుగుల నివారణకు లీటరు నీటికి 0.3 గ్రాముల ఫ్లోనికామిడ్‌ని అలాగే తామర పురుగులు గమనించినట్లైతే ఫిప్రోనిల్‌ని లీటరు నీటికి 2 మీలీ చొప్పున పిచికారి చేసుకోవాలని అన్నారు. ఈ క్షేత్ర పర్యటనలో మంచిర్యాల సహాయ వ్యవసాయ సంచాలకులు సురేఖ, కృషి విజ్ఞాన కేంద్రంశాస్త్రవేత్తలు డా. తిరుపతి, నాగరాజు, మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీనివాస్, గోవర్దన్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల పరిశీలన

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఆశ్రమ బాలికల పాఠశాలలో బుధవారం నిర్వహించిన గిరిజన పోషణ మిత్ర కార్యక్రమాన్ని బెల్లంపల్లి డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించి పోషక ఆహార లోపం లేకుండా చేడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆర్బీఎస్ కే బృందం, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా

నవతెలంగాణ-కాసిపేట

మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీలలో కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద భీమా నమోదు చేశారు. మండలంలో ఆయా పంచాయతీల్లో ఎంపీడబ్ల్యూ వర్కర్స్ విధులు నిర్వహిస్తున్న మండలంలోని 78 కార్మికులకు ప్రమాద భీమా రూ.10 లక్షలు వర్తించేటట్లు పంచాయతీ నిధుల నుండి ప్రతి ఒక్కరికి రూ.549 చొప్పున చెల్లించి ప్రమాద భీమా చేయించారు. ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ షేక్ సప్దర్ అలీ సమక్షంలో భీమా చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడబ్ల్యూ వర్కర్స్ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-హాజీపూర్

బైక్‌ను టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందిన ఘటన హాజీపూర్ మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ ఎదుట చోటు చేసుకుంది. లక్షెట్టిపేట నుంచి మంచిర్యాల వైపు వస్తున్న టిప్పర్ (ఏపీ 28టీ ఏ 0198), మంచిర్యాల నుంచి లక్షెట్టిపేట వైపు వెళ్తున్న బైక్‌ను డీకొనగా ఆత్రం జ్యోతి రావు(41)అనే వ్యక్తి మృతి చెందాడు. బైక్ పై వెళ్తున్న మరొక వ్యక్తి కోవ షేకు తీవ్రంగా గాయపడగా మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోనీ ఐసీయూలో చికిత్స పొందుతూన్నాడు. వీరిద్దరు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన వారు కాగా స్థానిక ఎస్ఐ గోపతి సురేష్ వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | సెప్టెంబర్ 26, 2024 | www.navatelangana.com

ఉద్యోగ భద్రత కల్పించాలి

నవతెలంగాణ-కౌటాల



గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత, పెన్షన్ విధానం, జీవిత బీమా పూర్తిగా సంబంధిత పంచాయతీ శాఖ చెల్లించాలని కార్మికులు కోరారు. బుధవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీఓ మహేందర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు గ్రామాలలో స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మేము ఎల్లవేళలా ముందుంటున్నామని తెలిపారు. కానీ తమకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రకాలుగా భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

అటవీ శాఖలో అవుట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలు

- నవతెలంగాణ కథనానికి స్పందన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

"సేవలు ఘనం ఫలితం శూన్యం" అనే శీర్షికన అటవీ శాఖలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతన కష్టాలను తెలుపుతూ రాసిన కథనానికి అటవీశాఖ అధికారులు స్పందించారు. శాఖలోని 149 మందికి పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల చెల్లించారు. ఈ సందర్భంగా పలువురు కృతజ్ఞతలు తెలిపారు.


సేవలు ఘనం.. ఫలితం శూన్యం

ఆరోగ్యమా..అనారోగ్యమా..!

- ఉదయం పూట క్రీడా మైదానాన్ని ముంచుతున్న ఎస్పీఎం పొగ
- వాకింగ్‌కు వెళ్లలేని పరిస్థితి ఉందంటున్న వాకర్స్

ఎవరైన తమ ఆరోగ్యం బాగుండాలని వాకింగ్‌కు వెళుతుంటారు. కాని కాగజ్‌నగర్‌లో మాత్రం తాము వాకింగ్‌కు వెళుతోంది ఆరోగ్యం కోసమా, అనారోగ్యం కోసమా అనే సందేహం వాకర్స్‌లో నెలకొంటోంది. తెల్లవారుజామునే ఎస్పీఎం క్రీడామైదానానికి వాకింగ్ కోసం వెళితే అక్కడ మిల్లు నుండి వెలువడే కాలుష్యం పొగతో వారు ఆందోళనకు గురవుతున్నారు.

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణవ్యాప్తంగా ఒకే ఒక క్రీడా మైదానం ఉంది. అది సిర్పూరు పేపర్ మిల్లు నిర్వహణలో ఉంది. ఎవరైనా వాకింగ్ చేయాలంటే ఆ మైదానానికి వెళ్లాల్సిందే. దీనికి సమీపంలోనే సిర్పూరు పేపర్ మిల్లు ఉంది. ఈ మిల్లు నుండి ఇటీవల కాలుష్యం పొగ విపరీతంగా వ్యాపిస్తోంది. ఈ పొగ ఎస్పీఎం క్రీడా మైదానాన్ని కూడా ముంచెత్తుతోంది.


అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద బహిరంగ కాలువలో ప్రవహిస్తున్న ఎస్పీఎం రసాయనిక నీరు

తెల్లవారుజామున మంచి వాతావరణంలో చల్లని గాలిలో వాకింగ్ కోసం వెళ్లిన వారికి ఈ పొగ చిరాకును తెప్పించడంతో పాటు అనారోగ్యాన్ని కల్పిస్తోంది. ఈ పొగలో వాకింగ్ చేయడం కంటే రోడ్డు మీద వాకింగ్ చేయడం మేలు అనుకొని కొందరు క్రీడా మైదానంలో వాకింగ్ చేయడం మానివేశారు. కాగజ్‌నగర్ నుండి సిర్పూరు వెళ్లే రోడ్డు, చారిగాం వెళ్లే రోడ్డుతో పాటు త్రిశూల్‌పహాడ్‌పైకి వాకింగ్ కోసం వెళుతున్నారు.

మురికి కాలువలోకి రసాయనిక నీరు

ఈ మిల్లు నుండి ప్రమాదకర రసాయనిక నీటిని బహిరంగ మురికి కాలువలోకి వదులుతున్నారు. ఉదయం పూట పొగలు కక్కుతూ ఈ రసాయనిక నీరు టౌన్ పోలీసుస్టేషన్, అర్బన్ హెల్త్ సెంటర్ ముందు నుండి వెళ్లే బహిరంగ మురికి కాలువ ద్వారా సర్‌సిల్క్ విజయబస్తీ చౌరస్తాలో ఉన్న నాళాలో కలుస్తోంది. ఇది అత్యంత ప్రమాదకరమని తెలిసినా యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ముఖ్యంగా ఈ మురికి కాలువకు ఇరు పక్కలా ఎలాంటి రక్షణ గోడలు లేవు. ఎవరైనా ప్రమాదవశాత్తు రోడ్డు మీది నుండి వెళుతూ ఆ మురికి కాలువలో పడితే రసాయన నీటి వాసనకే ప్రాణాలు వదలాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇటీవల సుభాష్‌చంద్రబోస్ కాలనీకి చెందిన మిరుదొడ్డి శంకర్ రాత్రి సమయంలో కనిపించక సైకిల్‌తో వెళ్లి ఇదే మురికి కాలువలో పడి మృతి చెందిన విషయం తెల్సిందే. వాస్తవానికి ఈ రసాయనిక నీటిని యాజమాన్యం భూ అంతర్భాగం నుండి పైపుల ద్వారా పట్టణం బయటకు పంపించి పెద్ద నాళాలో కలపాలి. కాని పట్టణం నడిబొడ్డున ఉన్న బహిరంగ మురికి కాలువలోకి ఈ నీటిని వదులుతుండడంతో రోడ్డున పోయేవారు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

సమీప కాలనీవాసుల అవస్థలు

మిల్లు సమీపంలోని కాలనీవాసులు కూడా కాలుష్యంతో అవస్థలు పడుతున్నారు. సర్దార్ బస్తీ, సంఘం బస్తీ, అశోక్ కాలనీ, రైల్వే స్టేషన్ ఏరియా, చార్‌నల్ ఏరియా, విజయబస్తీ ఏరియాలు నిత్యం కాలుష్యంతో నిండిపోతున్నాయి, కాలుష్యం పొగతో పాటు మిల్లు పొగ గొట్టం నుండి సుద్దలాగా తెల్లని, నల్లని బూడిద ఈ కాలనీలలో పడుతోంది. దీనితో ఆరు బయట ఉండలేని పరిస్థితి ఉంది. తెల్లని బట్టలు ఆరు బయట ఆరేస్తే గంట వ్యవధిలోనే ఆ బట్టలపై నల్లని మచ్చలు ఏర్పడతాయని ఆ కాలనీవాసులు వాపోతున్నారు.


క్రీడా మైదానాన్ని ముంచెత్తిన ఎస్పీఎం కాలుష్యం పొగ

అనారోగ్యం బారిన పడుతున్నారు

ముంజం ఆనంద్‌కుమార్, వాకర్స్ అసోషియేషన్ సభ్యుడు



సిర్పూరు పేపర్ మిల్లు వైఖరి కారణంగా పట్టణవాసులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ముఖ్యంగా క్రీడా మైదానానికి వచ్చే వాకర్స్‌కు మిల్లు నుండి వెలువడే పొగ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. వాకింగ్ చేస్తే వచ్చే ఆరోగ్యం మాట పక్కన పెడితే, కాలుష్యపు పొగలో వాకింగ్ చేస్తే వచ్చే అనారోగ్యమే అధికంగా ఉంటుందనే భావనతో నేను వాకింగ్‌కు అక్కడికి వెళ్లడమే మానేశాను.

ప్రతి ఆయుధంపై పూర్తి అవగాహన ఉండాలి



నవతెలంగాణ-తలమడుగు

ఆయుధ పరిజ్ఞానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. బుధవారం మండలంలోని సుంకిడి గ్రామ సమీపానగల పోలీస్ ఫైరింగ్ బట్ వద్ద శిక్షణ పోలీసు కానిస్టేబుళ్లకు ఆయుధాలపై శిక్షణ ఇచ్చారు. అవాంఛనీయ సంఘటన పై సంఘవిద్రోహ శక్తులపై పోరాడే ప్రతిమను, మెలుకువలను వివరించారు. ఫైరింగ్‌లోని మెలుకువలు, విధానాలపై సిబ్బందికి తెలియజేశారు. టీయర్ గ్యాస్, స్టన్ గ్రానైట్, వజ్రా వాహనంలో గ్యాస్ గ్రానైట్ ప్రయోగం లాంటి అంశాలను వివరించారు. అదేవిధంగా ఫైరింగ్ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు విధివిధానాలపై సిబ్బందికి తెలియజేశారు. ఫైరింగ్ పొజిషన్స్, శత్రువులపై దాడి చేసే విధానాలు తదితర అంశాలను తెలియజేస్తూ వాటిని అనుసరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్ రావు, డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, పోలీసు శిక్షణ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవాగులో 11 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ పెద్దవాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 11 ట్రాక్టర్లను అధికారులు పట్టుకున్నారు. సీఐ సతీష్ తెలిపిన వివరాలు ఆర్డీఓ లోకేశ్వరరావు, మైనింగ్ ఏడీ గంగాధర్‌కు ట్రాక్టర్లకు సంబంధించిన పత్రాలను చూపడంతో ఎలాంటి అనుమతి లేకుండా రవాణా చేస్తున్నారని తెలుసుకున్నారు. అనంతరం వాటిని స్వాధీనం చేసుకొని ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

విద్యార్థులకు షీ టీం అవగాహన సదస్సు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఆసిఫాబాద్ సబ్ డివిజన్ షీ టీం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఇన్‌చార్జి సునీత మాట్లాడుతూ మహిళలు, పిల్లల రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు మరింత దగ్గరై సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే డయల్ 100కు కాల్ చేయాలని, స్థానిక పోలీస్ అధికారులకు తెలియజేయాలని, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, లైంగికంగా వేధించటం, వెంటపడడం ఇటువంటి చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలను ఎవరైనా వేధిస్తే ఆసిఫాబాద్ షి టీమ్ నంబర్ 8712670564కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీం సిబ్బంది శ్రీలత, ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌటాల ఎంఈఓగా హన్మంతు

నవతెలంగాణ-కౌటాల



మండల విద్యాశాఖాధికారిగా గావుడె హనుమంతు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎంఈఓ సోమయ్య బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో తోట రమేష్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని భావించి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నోడల్ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు మంగళవారం మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు అప్పగిస్తు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కౌటాల మండల విద్యాశాఖాధికారిగా గావుడె హనుమంతు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల విద్యాధికారిగా విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

జీఎంను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్‌ను కాంగ్రెస్ నాయకులు అజ్మీరా ఆత్మరాం నాయక్, రాష్ట్ర సేవాలాల్ సేన ప్రెసిడెంట్ ప్రెసిడెంట్ గోగ్గుల్ రవి నాయక్ ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం గోలేటిలో కొత్తగా ఓసీలో ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో జరపల తిరుపతి, లావిద్య మోహన్, శివ, శ్రీధర్, కోట శేఖర్, సంతోష్, బాలాజీ, నగేష్, భీమేష్, చరణ్ పాల్గొన్నారు.

జీవితాన్ని అర్పించిన నాయకుడు దీన్‌దయాల్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశం కోసం జీవితాన్ని అర్పించిన నాయకుడు పండింత్ దీనదయాల్ ఉపాధ్యయ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దీనదయాల్ ఉపాధ్యయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడుతూ శ్రద్ధాంజలి ఘటిస్తు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ తన జీవితాన్ని దేశ సేవ కోసమే దీనదయాల్ అర్పించారని గుర్తుచేశారు. ఆర్ఎస్ఎస్ లో కొనసాగిన ఆయన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీతో కలిసి జన సంఘ్ ను స్థాపించారన్నారు. నేడు బీజేపీ ఈ స్థానంలో ఉందంటే వారి కృషి చాలా ఉందన్నారు. దీనదయాల్ ఉపాధ్యాయ ఆశయ సాధన దిశగా ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాంపెల్లి వేణుగోపాల్, వేదవ్యాస్, ముకుంద్, విజయ్, మయూర్ చంద్ర, ఆకుల ప్రవీణ్, క్రిష్ణ యాదవ్, ఆస్తక్ సుభాష్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : మండల కేంద్రంలో జన సంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతినీ బీజేపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండరీ రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు కొలిపాక రాజశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి బింగి వెంకటేష్, గిరిజన మోర్చా జిల్లా నాయకులు రాథోడ్ శేషరావు, జిల్లా నాయకులు లింగగౌడ్, చంద్రశేఖర్, కాల్వ రవి, కైలాష్, మహేందర్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : పండిత్ దీన్‌దయాల్ సేవలు వెలకట్టలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మాజీ జడ్పీటీసీ నివాసంలో మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి దీన్‌దయాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అట్టడుగున పడిఉన్న మానవుడు ఐహిక సుఖంతో వర్ధిల్లి, ఆధ్యాత్మిక దృష్టితో మానవసేవ చేయడమే సరైన జీవిత విధానమని చాటాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్, జిల్లా ఉపాధ్యక్షులు విశాల్ ఖంద్రే, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చారి, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం పండిత్ దీనదయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌తో పాటు నాయకులు దీనదయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1952లో భారతీయ జనసంఘ్‌లో చేరిన ఉపాధ్యాయ, 1967లో అధ్యక్ష బాధ్యతలు చేపట్టారని అన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ మరణం అనంతరం ఆయన పార్టీ బాధ్యతలను తన భుజంపై వేసుకొని విజయపథంలో నడిపించాడని అన్నారు. అనంతరం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యమంలో బీజేపీ నాయకులు ధోని శ్రీశైలం, సిందం శ్రీనివాస్, దెబ్బటి శ్రీనివాస్, వీరభద్రచారి, చన్నపురి గణపతి, అరుణ్‌లోయ, వలపదాసు శ్రీదేవి, గోలెం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్


ఆదిలాబాద్‌టౌన్

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మౌనిష్‌రెడ్డి



నవతెలంగాణ-జైనథ్

పాటుకాటుకు గురై మృతి చెందిన మండలంలోని బాలాపూర్ గ్రామానికి చెందిన ఈరవేణి రవీందర్ కుటుంబ సభ్యులను సామాజిక కార్యకర్త మౌనిష్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ప్రశాంత్ కడిసే, జక్కుల కిషన్, గాజుల కిష్టు, సాగర్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

సభ్యత్వాన్ని పూర్తిస్థాయిలో నమోదు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సభ్యత్వాన్ని పూర్తిస్థాయిలో నమోదు చేయాలని బీజేపీ కేంద్ర సంఘటన్ మంత్రి చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. బుధవారం పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంల నిర్వహించగా దీనికి కేంద్ర సంఘటన్ మంత్రి చంద్రశేఖర్ ముఖ్యాతిథిగా హాజరయ్యారు. సభ్యత్వంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి సభ్యత్వ నమోదు చేయ్యాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో కూడా బీజేపీ విజయం సాధించాలన్నారు. ప్రతీ పోలింగ్ బూత్ పరిధిలో నాయకులు, కార్యకర్తలు పర్యటించాలన్నారు. యువతను ఎక్కువగా సభ్యులుగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూట్ మెంబర్ ఎన్రాల నగేష్, విజయ్ బోయర్, పార్లమెంట్ కో కన్వీనర్ మయూర్ చంద్ర, పట్టణ అధ్యక్షులు లాలామున్న, మున్సిపల్ ఫ్లో లీడర్ ఆకుల ప్రవీణ్, జోగు రవి, కృష్ణ యాదవ్, సోమరవి, నాయకులున్నారు.

అక్టోబర్ 3 నుండి ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓపెన్ స్కూల్ సోసైటీ ద్వారా అక్టోబర్ 3 నుంచి 9వ తేది వరకు జిల్లాలో పదవతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను నిర్వహించనున్నట్టు డీఈఓ ప్రణీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుండి 12 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 2:30 గం.ల నుండి సాయంత్రం 5.30 గం.ల వరకు పరీక్షలుంటాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే వారు గంట ముందు హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైన ఫోటో గుర్తింపు, ఆధార్ కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. పుస్తకాలు, ఎలాక్ట్రానిక్ వస్తువులు సెల్ ఫోన్లు అనుమతించబోమన్నారు. పరీక్ష కేంద్రాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. అధ్యయన కేంద్రాల నుండి వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణఓపెన్‌స్కూల్.ఓఆర్‌జీ ద్వార కూడా హాల్ టిక్కెట్లను పొందవచ్చునని సూచించారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు అక్టోబర్ 10 నుండి 23 వరకు ప్రభుత్వ జూనియర్ కళశాల (బాలికలు)లో ఉంటాయని పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డిఎం కార్యక్రమం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో ఈనెల 26న గురువారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజల సలహాలు, సూచనలు, ఫిర్యాదులకు 9959226002ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఐఎసిఈ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎసిఈ సంస్థ రిసోర్స్ పర్సన్ మహిత కేంద్ర ప్రభుత్వ స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంకింగ్, రైల్వే వంటి వాటిల్లో ఉద్యోగ అవకాశాలు, ప్రిపేర్ అయ్యే విధానం, సిలబస్, జాబ్ క్యాలెండర్ తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. తెలంగాణ ప్రాంత విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలే కాకుండా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలపై దృష్టి పెడితే మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.సంగీత, టాస్క్ కోఆర్డినేటర్ ఐ.శ్రావణి, అధ్యాపకులు సంతోష్ కుమార్, చక్రవర్తి పాల్గొన్నారు.

కల్తీ లడ్డూకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకవాలి

నవతెలంగాణ-పెంబి

ఆంధ్రప్రదేశ్ రాష్టంలోని తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందువులు పవిత్రంగా భావించే లడ్డు ప్రసాదంలో కల్తీ నేయ్యి ఉపయోగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకులు కోరారు. బుధవారం తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందించారు. హిందువుల మనోభావాలు దెబ్బ తీసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అందె రాజు, పాకాల ప్రవీణ్, నరేందర్, సతీష్ పాల్గొన్నారు.

